ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 7 జనవరి 2025





ముగ్గుల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన కళాశాల విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ వెంకటమురళి



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత అద్దేపల్లి సునీత



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత బీ ఉమాదేవి



మూడో బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత తిరుమల

- సప్తవర్ణశోభితమైన నేల
- ముందుగానే వచ్చిన సంక్రాంతి శోభ
- బాపట్లలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, విద్యార్థినులు
- పోటీలను ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి

మురిసిన మనసులు..

ముత్యాల ముగ్గులు..!



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు



అద్దేపల్లి సునీతకు ప్రథమ బహుమతి అందిస్తున్న ఏఎస్‌పీ విఠలేశ్వర్ దంపతులు



బి.ఉమాదేవికి రెండో బహుమతి అందిస్తున్న జేసీ ప్రఖర్ జైన్ తదితరులు



ఎన్.తిరుమలకు మూడో బహుమతి అందిస్తున్న బిల్డర్ గుండ్రెడ్డి శివ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన రంగవల్లులతో ప్రాంగణమంతా కూడా సప్తవర్ణ శోభితమైంది. వయోభేదం లేకుండా చిన్నారులు మొదలుకుని విద్యార్థినులు, గృహిణులు పోటీపడి ముగ్గులేసి వారం ముందే సంక్రాంతి శోభను కనుల ముందుంచారు. సోమ వారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముగ్గుల పోటీలకు బాపట్ల మున్సి పల్ హైస్కూల్ వెనక ఉన్న రోడ్డు వేదికగా నిలిచింది. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా స్పాన్సర్ చేయగా.. జిల్లా కలెక్టర్ వెంకటమురళి ప్రారంభించారు. జేసీ ప్రఖర్‌జైన్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ సతీ సమేతంగా వచ్చి ముగ్గులను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ బిల్డర్, కర్లపాలెం మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ కార్య క్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించారు.

ఉత్సాహంగా.. పెద్ద సంఖ్యలో..

ముగ్గుల పోటీలకు మహిళల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. మొత్తం 114 మంది రంగవల్లుల పోటీల్లో పాల్గొనగా ఇందులో 50మంది వరకు కళాశాల విద్యార్థినులు, పాఠశాల బాలికలు పాల్గొనడం వారి ఆసక్తికి నిదర్శనంగా ఉంది. తెలుగు వారి సంప్ర దాయాలతో పాటు సంక్రాంతి విశిష్టతను చాటే విధంగా వివిధ ఆకృతులలో ముగ్గులను వేసి ఇలపై ఇంద్రధనస్సును ఆవిష్కరింపజేశారు. బాపట్ల జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా మహిళలు హాజరై ముగ్గుల పోటీల్లో పాల్గొని వారి ఇష్టాన్ని చాటుకున్నారు.

మొదటి మూడింటితో పాటు.. ప్రోత్సాహక బహుమతులు

మొత్తం 114మంది మహిళలు పోటీల్లో పాల్గొనగా ప్రథమ బహుమతి కింద రూ.6,000 నగదు పురస్కారాన్ని సత్తెనపల్లికి చెందిన అద్దేపల్లి సునీత గెలుచుకోగా, ద్వితీయ బహుమతి కింద రూ.4,000 జిల్లెలమూడికి చెందిన బి.ఉమాదేవి, తృతీయ బహుమతి రూ.3,000ను ఎంవీరాజుపాలెం నివాసి ఎన్ తిరుమల గెలుచుకున్నారు. ఇవే కాకుం డా ప్రోత్సాహక బహుమతులను మరో ఏడుగురికి అందజేశారు. చెరుకుపల్లికి చెందిన సూరగాని లక్ష్మీకాంతమ్మ, బాపట్ల రైలుపేటకు చెందిన ఎం గుడారంకమ్మ, బాపట్లకు చెం దిన ఎం పద్మలత, వైఎస్సార్ నగర్ వెస్ట్ బాపట్లకు చెందిన కనకకుమారి కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న బాపట్ల పబ్లిక్ స్కూల్‌కు చెందిన మనస్విని, బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల విదార్థిని పీ భార్గవి, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని పి.వెన్నెల వర్షిణి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు

ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి అభినందనలు : కలెక్టర్

కొన్ని తరాల నుంచి వస్తున్న సంస్కృతీ సంప్రదాయాల ను భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన చిన్నారులకు, విద్యార్థులతో మాట్లాడి ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం ముగ్గులపై వారి ఆసక్తికి నిదర్శనమ న్నారు. పోటీలు ముగిసిన తర్వాత విజేతలకు బహుమతులను జేసీ ప్రఖర్‌జైన్‌తో పాటు ఏఎస్పీ విఠలేశ్వర్ దంపతులు అందజేశారు.

చాలా ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఎంతో దూరం నుంచి ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చాను. మొదటిబహుమతి గెలుచుకుంటానని అసలు ఊహించలేదు. ఈ ముగ్గుల పోటీలను చూస్తుంటే వారం రోజుల ముందుగానే పండుగ వచ్చినట్లయింది.

- అద్దేపల్లి సునీత, సత్తెనపల్లి(ధూళిపాళ్ల), ప్రథమ బహుమతి విజేత

ప్రతి ఏడాది పాల్గొంటాను

ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గులపోటీల్లో ప్రతి ఏడాది పాల్గొంటాను. ఇప్పటికీ 16సార్లు పాల్గొన్నాను. గతంలో చాలా బహుమతు లు గెలుచుకున్నాను. ఇప్పుడు రెండోస్థానంలో నిలవడం ఆనందంగా ఉంది.

- బి. ఉమాదేవి, జిల్లెళ్లమూడి, ద్వితీయ బహుమతి విజేత

వేడుకలా ఉంది

ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొనడం, మూడో బహుమతి గెలవడం సంతోషంగా ఉంది. ఇంతమందితో కలిసి ముగ్గుల పోటీల్లో పాల్గొనడం మరచిపోలేను. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపడుతున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి అభినందనలు.

- ఎన్ తిరుమల, ఎంవీరాజుపాలెం, తృతీయ బహుమతి విజేత

ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



పందెం కోళ్లు కత్తి కట్టి కాలు దువ్వడానికి సిద్ధం అవుతుంటే, రూ.కోట్లలో పందాలు వేసేందుకు వీలుగా బరులను సిద్ధం చేస్తున్నారు. మరో వారంలో పండుగ సందడి మొదలవుతున్న తరుణంలో కృష్ణానది తీర ప్రాంతాలు, సముద్ర తీర మండలాల్లో కొన్నిచోట్ల ఇప్పటికే కోడి పందాల కోసం బరులు ఏర్పాటుచేసే పనిలో నిమగ్నమయ్యారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న బరుల కోసం ఇప్పటికే రబీ పంట వేసిన చేలను తీసుకుని పది నుంచి 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అన్ని ఏర్పాట్లతో బరికి సిద్ధమవుతున్నారు. మరోపక్క కేవలం పందెం కోసమే పెంచుతూ వస్తున్న కోడి పుంజులు లక్షలు పలుకుతున్నాయి. వీటి ధరే ఇంత ఉంటే వాటితో వేసే పందాలు ఎంతటి స్థాయిలో ఉంటాయనేది ఊహకందని విషయమే. కేవలం కోడిపందాలే కాకుండా కోతముక్క, గుండాట వంటి మిగిలిన జూద క్రీడలకు ఈ బరులు ఏర్పాటుచేస్తున్న ఆవరణలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు మద్యం, బిర్యానీ కేంద్రాలకు కొదవే లేకుండా చూసేందుకు కూడా వెనుకాడటం లేదు.



చెరుకుపల్లి మండలం పుషాడపువారిపాలెం దగ్గర ఎక్సకవేటర్‌లు, ఇతర యంత్రాలతో కోడి పందాల కోసం బరి సిద్ధం చేస్తున్న చిత్రం

బరి తెగింపునకు సిద్ధం

- సంక్రాంతి వేళ కోడి పందాలకు సిద్ధమవుతున్న తీరం
- జూదం, మద్యం దుకాణాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- చివరిలో మ్యూజికల్ నైట్స్‌కూ సన్నాహాలు
- ఇప్పటి నుంచే లాడ్జీలూ బుకింగ్

తెనాలి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన గుంటూరు జిల్లా నుంచి సముద్ర తీరంలోని బాపట్ల జిల్లా వరకు కోడి పందాలకు కొదవ లేకుండా బరులు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రెండు నుంచి ఐదు కి.మీ దూరంలో ఒక బరి ఉండేలా ఏర్పాట్లు చేస్తే, ఇప్పుడు మాత్రం వాటిని తగ్గించి కేవలం జూదం కోసమే కాదన్నట్లు పరిమితంగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ప్రస్తుతానికి 8 చోట్ల పెద్ద స్థాయి బరులు ఏర్పాటు చేసేందుకు నేతల నుండి అనుమతి దక్కినట్లు సమాచారం. అటు సముద్ర తీర మండలాల్లోని నిజాంపట్నం, నగరం, పీవీ పాలెం, కర్లపాలెం, బాపట్ల మరికొన్ని చోట్ల కోడి పందాలకు చిన్నస్థాయి నుంచి పెద్దస్థాయి వరకు బరులు ఏర్పాటు అవుతున్నాయి. దుగ్గిరాల మండలంలో ఒక చోట, కొల్లిపర మండలంలో రెండు చోట్ల, కొల్లూరు మండలంలో రెండు చోట్ల, భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, నగరం మండలాల్లో ఒక్కొక్క చోట బరులు ఏర్పాటు చేసేందుకు నేతలు ఒకే అన్నారంటూ వాటిని స్థానిక నాయకులు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసేందుకు పెద్ద పెద్ద ఎక్సకవేటర్‌లను దించేశారు. బరులు వేసే ప్రాంగణం చుట్టూ సిమెంట్ దిమ్మెలు, ముళ్ల కంచె సాయంతో ఫెన్సింగ్ వేస్తూ లోపల మాత్రం ఐదు నుంచి 10 వరకు బరులు ఉండేలా ఒక్కో చోట సిద్ధం చేస్తున్నారు.

మద్యం, జూదానికి ఫుల్ డిమాండ్...

కోడి పందాల కోసం ఏర్పాటు చేసే బరులను ఆయా ప్రాంతాల నేతల అనుచరులు, కింది స్థాయి నేతలు తమ ఆధీనంలో సిద్ధం చేస్తుంటే దానిలో కేవలం కోడి పందాలకే కాకుండా జూదం, మద్యం శిబిరాలకు మంచి డిమాండ్ పలుకుతోంది. సాధారణంగా ఒక బరిని ఏర్పాటు చేయాలంటే దానికి అంగీకారం తెలిపే నేతలకు, పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ వంటి సంబంధిత శాఖల అధికారులకు పందాలు నిర్వహించే వారం నుంచి పది రోజుల గడువునకు బరి స్థాయిని బట్టి రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు మమూళ్లు ఇవ్వడం పరిపాటి. అంత మొత్తంలో రాబట్టుకునేందుకు నిర్వాహకులు కూడా రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పందాలు వేసుకునేందుకు వీలుగా ప్రత్యేక బరులను సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటే మద్యం దుకాణాలు, బిర్యానీ సెంటర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఒక్కోదానిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వేలంలో వారికి అప్పగించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. కోడి పందాలు చూడాలన్నా, కోడిని బరిలో దింపాలన్నా ఫీజు చెల్లించాల్సిందే. పందెం కాసిన మొత్తంలోనూ పది శాతం నిర్వాహకులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి కాక పార్కింగ్, కోతముక్క, గుండాట వంటి శిబిరాలకు లక్షల్లోనే డిమాండ్ ఉంటోంది. గతంలో బరులు ఎక్కువగా ఉండటంతో పందెం వేసే వారిని ఆకట్టుకునేందుకు బుల్లెట్ నుంచి కారు వరకు బహుమతులు అందించిన వారు ఉన్నారు. అయితే ఈ సారి బరులు పరిమితంగానే ఉండటంతో ఇటువంటి ఆకర్షణీయ బహుమతులు ఏ స్థాయిలో ఉంటాయో చూడాల్సిందే

కోడి పందాలకు స్థానికంగా ఉండే వారే కాకుండా తెలంగాణా నుంచి కూడా భారీ సంఖ్యలో ఏటా వస్తుండటంతో పట్టణాల్లో లాడ్జీలు కూడా ఇప్పటి నుంచే నిండిపోతున్నాయి. కొన్ని చోట్ల నిర్వాహకులే కొన్ని లాడ్జిలను రిజర్వ్ చేసుకుని పెట్టుకుంటుంటే పట్టణాలకు దూరంగా బరులు ఉన్నచోట మాత్రం ఖాళీగా ఉన్న ఇళ్లను అద్దెకు తీసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. ఇదిలా ఉంటే సంక్రాంతి పండుగ చివరి రెండు రోజులు కోడి పందాలతో పాటు ముగింపు వేడుకల కింద మ్యూజికల్ నైట్స్ కూడా ఏర్పాటు చేసేందుకు శిబిరాలను ఇప్పటి నుంచే కేటాయిస్తున్నారు. వీటిలో సరదాగా జనానికి ఒక చోట అయితే వీఐపీలకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి అన్ని వసతులు కల్పించేందుకు కూడా హైటెక్ సొగసులతో తీర్చిదిద్దేందుకు గృహోపకరణ సామాగ్రిని దింపేస్తున్నారు. పండుగ దగ్గర పడుతుండటంతో పందెం కోళ్ల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఒక్కో కోడి పుంజు రూ.20 వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోందని పెంపకందారులు చెబుతున్నారు. మొత్తం మీద సంక్రాంతి వేళ కోడి పందాల వేడుకలు మాత్రం జూద క్రీడలకు సిద్ధమవుతోంది.



పందాల కోసం సిద్ధంగా ఉన్న కోళ్లు

చిన్న చిన్న బరుల కోసం సిమెంట్ దిమ్మెలతో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్న చిత్రం



జిల్లా ఓటర్లు.. 12,95,527

- 2024 జనవరి తుది జాబితాతో పోలిస్తే 19,987 ఓట్ల పెరుగుదల

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది జనవరి 1 నాటికి జిల్లాలో ఉన్న తుది ఓటర్ల జాబితాను ఈసీ సోమవారం విడుదల చేసింది. దీనిలో భాగంగా జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్యను 12,95,527గా తెలిపింది. ఇందులో పురుషుల సంఖ్య 6,33,807కాగా, మహిళల సంఖ్య 6,61,640గా, థర్డ్ జెండర్ సంఖ్య 80గా తుది ప్రచురణలో ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 2024 జనవరిలో ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో జిల్లాలో ఉన్న మొత్తం ఓటర్ల సంఖ్యను 12,75,540గా ఉండగా ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో 19,987 ఓట్ల పెరుగుదల నమోదైంది. ఎప్పటిలాగానే ఓటర్ల సంఖ్యలో అతివలదే అగ్రస్థానంగా ఉంది.



పర్చూరులో విషాదం

- అక్కాచెల్లెళ్లు సజీవదహనం
- షార్ట్ సర్క్యూట్‌తో ఘటన
- తీవ్రంగా గాయపడిన తల్లి

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో అక్కా చెల్లెళ్లు సజీవదహమయ్యారు. వివరాలు ఇలా వున్నాయి. పర్చూరు తూర్పుబజార్ వీధిలో దాసరి వెంకటేశ్వర్లు, లక్ష్మీరాజ్యం దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంలో అక్కా చెల్లెళ్ళు దాసరి నాగమణి(34), చెల్లెలు మాధవీలత(30) మృతి చెందారు. అనారోగ్యంతో మంచంలో ఉన్న నాగమణి సజీవదహనం కాగా మంటలను ఆర్పే ప్రయత్నంలో పొగతో ఊపిరి ఆడక మాధవీలత మృతి చెందింది. తల్లి రాజ్యలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. అగ్ని ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న మార్టూరు సీఐ ఎం శేషగిరిరావు హుటాహుటీన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రగాయాలతో ఉన్న రాజ్యలక్ష్మిని 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటిలో కాలిపోయి మృతి చెందిన అక్కా చెల్లెళ్ల మృతదేహాలను పోస్టుమార్టు నిమిత్తం పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పర్చూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాద స్థలాన్ని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పరిశీలించారు. అదేవిధంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ నేతృత్వంలో సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేశారు.



ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు, ఎస్ఐ రత్నకుమారి

సచివాలయాలకు ఫైబర్ నెట్ సేవలు అందించాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు, పక్కన బీఎస్ఎన్ఎల్ జీఎమ్ శ్రీధర్

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలకు, ఆయా పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ సేవలు అందేలా ప్రణాళిక రూపొందించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గుంటూరు, స్థానిక చంద్రమౌళి నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సోమవారం టెలికం అడ్వైజరి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రైవేటు ఆపరేటర్ల కంటే మెరుగైన సేవలు అందించాలని సూచించారు. భారత్ నెట్ వినియోగదారులను పెంపొందించుకోవాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని 4జీ టవర్లను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో కూడా సేవల్లో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలోని 40శాతం టవర్లను 4జీగా మార్చామని, మిగిలిన టవర్లను ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా ఎంపీ అయోధ్య రామిరెడ్డి పాల్గొనగా, నేరుగా ఆ సంస్థ డీజీఎమ్ శ్యామ్‌ప్రసాదు, ఐఎఫ్ఏ బాజీ, ఏజీఎమ్ గిరిబాబు, డీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను భవిత కేంద్రాలకు పంపండి



మాట్లాడుతున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్యకుమారి

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లోపాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ ఎ.సూర్యకుమారి అన్నారు. సోమవారం గుంటూరు మహిళా ప్రాంగణంలో పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విషయంలో తల్లిదండ్రులకు తగిన కౌన్సెలింగ్ నిర్వహించి వారిని భవిత కేంద్రాలకు తరలించాలని అన్నారు. పిల్లలకు పోషకాహార సేవలను అందించడానికి, వారి సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, అంగన్‌వాడీ కార్యకర్తలందరి నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయడం కోసం భారత ప్రభుత్వం పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి విజయలక్ష్మి, ఈడీ పద్మజ, కోర్సు డైరెక్టర్ పుష్పలత, డాక్టర్ ప్రియాంక, ఉదయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.

రేపు డైట్‌లో రంగోత్సవ్ పోటీలు

గుంటూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్) బోయపాలెంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 8న రంగోత్సవ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతులు చదువుతున్న బాల బాలికలు అర్హులని తెలిపారు. మొత్తం 8 విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. క్విజ్, స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాల డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ (తెలుగు, ఆంగ్లం) రంగోలి (5 గురు సభ్యులు) జానపద నృత్యం, డిజిటల్ కాలేజి (యూనిటీ, సమైక్యత పోస్టర్) స్లోగన్ రైటింగ్ (ఏక్ భారత్ శ్రేష్ఠ భారత) రోల్ ప్లే (భారత సంస్కృతి, చరిత్రకు సంబంధించినవి) ఉంటాయి. గతేడాది పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన వారు పాల్గొనుటకు అనర్హులని తెలిపారు. ప్రతి కళా రూపానికి 5 నిముషాల సమయం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో అధ్యాపకులు సి.పోలేరు, డాక్టర్ కె.ప్రసాద్ (9704790917, 8019207528)ను సంప్రదించాలని సూచించారు.

చినవడ్లపూడిలో యువకుడి బలవన్మరణం

మంగళగిరి సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినవడ్లపూడి గ్రామంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన పప్పు బాల జగదీశ్ (28) చినవడ్లపూడి గ్రామానికి చెందిన వలివేటి బాలకృష్ణ వద్ద గేదెల ఫారంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన జగదీశ్ తరచూ ఇంటికి ఫోను చేసి తనకు చదువు అబ్బకపోవడంతో జీవితం నాశనమైందనీ, తనకు బతకాలని లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 29న గేదెల షెడ్డు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు ఎయిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ జగదీశ్ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని సోదరుడు పూర్ణలీలా సాయికృష్ణ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను కొనొద్దు

● వాటికి ఎటువంటి అనుమతుల్లేవు
● రైల్వే కూడా ఎన్‌వోసీ రద్దు చేసింది
● వాటిని దాచిపెట్టి విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడు
● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర, పక్కన పిల్లి బాబురావు

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి మరళి గుంటూరు నగరంలోని స్వామి థియేటర్ సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్లను కొనవద్దని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు విద్యానగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ గ్రేస్ హైరైజ్ అపార్టుమెంట్స్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినా వాటిని విక్రయించాలని అంబటి మురళి చూస్తున్నాడని, ఆయన ఉచ్చులో పడొద్దని సూచించారు. రైల్వే అనుమతి లేకపోయినా రాజకీయ పలుకుబడితో నగరపాలక సంస్థ అధికారులను ప్రలోభాలకు గురిచేసి ఈ నిర్మాణం చేపట్టాడని అన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తే రాజకీయ వేధింపులంటూ అంబటి మురళి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మిస్తున్న ఆదిత్య ఇన్‌ఫ్రాకు రైల్వే ఎన్‌వోసీ రద్దు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రద్దు చేసిన లేఖను అప్పటి మంత్రి, మురళీ సోదరుడు అంబటి రాంబాబు అండతో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాయం చేసిన విషయం నిజమా, కాదా అని ప్రశ్నించారు. ఆ తరువాత అనుమతి కోసం ఏలూరు జూట్‌మిల్ ప్రైవేట్ లిమిటడ్ (భజరంగ్ జూట్‌మిల్లు పూర్వ పేరు) దరఖాస్తు చేసుకున్నా రైల్వే అధికారులు తిరస్కరించారని అన్నారు. అనుమతి రద్దు, తిరస్కరణలు వైసీపీ అధికారంలోనే జరిగాయని, టీడీపీ హయాంలో కాదని గుర్తుచేశారు. దీంతో రాజకీయ కక్ష ఎక్కడ ఉందని ప్రశ్నించారు.

మోసానికి ప్రతి రూపం...

రైల్వే ట్రాక్ నుంచి 60 అడుగుల రోడ్డును వదిలివేసి నిర్మాణం చేస్తానని మాస్టర్ ప్లాన్‌లో చూపించి, ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఆ రోడ్డులో కూడా నిర్మాణం చేపట్టడం వాస్తవం కాదా అని నిలదీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మరోసారి అనుమతి కోసం కార్పొరేషన్‌కు లేఖ పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకపక్క వందల సంఖ్యలో ఫ్లాట్లను నిర్మిస్తూ డెవలప్‌మెంట్ పేరుతో ఏలూరు జూట్‌మిల్‌కు 87 ఫ్లాట్లను ఇచ్చే విధంగా జీపీఏ చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్లు కొన్నవారితో హైకోర్టులో కేసు వేయడం ఏ విధంగా చూడాలన్నారు. మోసానికి అంబటి మురళి ప్రతి రూపమని మండిపడ్డారు. అసలు జూట్‌మిల్ స్థలం మదర్ డాక్యుమెంట్లు మురళీ వద్ద లేవనీ, వాటిని దాచి పెట్టి వినియోగదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాడని ఆరోపించారు. గత టీడీపీ హయాంలోనే రిజిస్ట్రేషన్లు చేయవద్దని అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. మదర్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్‌లను బయట పెట్టాలని అడిగిన జూట్‌మిల్ కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావుపై అంబటి మురళి దాడి చేయించాడని ఆరోపించారు. గ్రీన్ గ్రేస్ భవనాలకు అడ్డగోలు అనుమతులకు సహకరించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని గుంటూరు ఎమ్మెల్యేలతో కలసి త్వరలోనే ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. సమావేశంలో జూట్‌మిల్లు కార్మిక సంఘం నేత పిల్లి బాబురావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చడమే లక్ష్యం

● ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం
● శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు



క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న శాప్ చైర్మన్ రవి, ఎంపీ, విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు (విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందనీ, ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం ఉండాలని జీవో జారీ చేసిందని క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే 'విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు 2025' ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు సోమవారం కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడాంశాలతో పాటు నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు నగదు ప్రోత్సాహకంతో పాటు గ్రూప్-1 ఉద్యోగాన్ని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆసియా క్రీడలు, ఖేలో ఇండియా తదితర క్రీడల్లో సత్తాచాటిన వారికి అందుకు అనుగుణంగా పారితోషికాలు అందిస్తుందని వెల్లడించారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ శాతాన్ని ప్రభుత్వం పెంచిందని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనూరాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అందరికీ సమాన విద్యావకాశాలు



హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ సలహాదారు ఎండీ షరీఫ్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యాపరంగా ఎదగాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని మైనారిటీ బాలికల హాస్టల్‌ను సోమవారం ఆయన ఏపీ మైనారిటీ సలహాదారుడు, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్‌తో కలిసి పరిశీలించారు. మైనారిటీ హాస్టల్‌లో సౌకర్యాలు, స్టడీ తరగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో వసతులు బాగున్నాయా?, బోధన విధానం ఎలా ఉంది? అంటూ ఆరా తీశారు. హాస్టల్లో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే తమను సంప్రదించాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. హాస్టళ్లలో కేవలం విద్యా బోధన, స్టడీ తరగతులకే పరిమితం కాకుండా నేటి తరానికి అనుగుణంగా ఎనిమిదో తరగతి నుంచే టెక్నాలజీలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న మైనారిటీ హాస్టళ్లను సువిశాలమైన సొంత భవనాల్లోకి మారుస్తామని తెలిపారు. షరీఫ్ మాట్లాడుతూ మైనారిటీల విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అన్ని పాఠశాలలో సమగ్ర విద్యా విధానాలు అవలంబించేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సూరై శ్రీనివాస్, జగన్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, జమీర్, రఫీ, పుట్టగుంటి వెంకటేశ్వరరావు, కలాం, ఈర్ల లక్ష్మి, మస్తాన్, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం

● జిల్లా వ్యాప్తంగా 143 సర్వీసులు సిద్ధం
● 9 నుంచి 19 వరకు స్పెషల్ సర్వీసులు

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పర్వదినాలైన సంక్రాంతికి అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విభజిత గుంటూరు జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతోపాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 143 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచే సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందుకోసం టిక్కెట్ రిజర్వేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించారు. సంక్రాంతి పండగకు విద్యా, ఉద్యోగం, ఇతర పనులపై హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న వారు తిరిగి గుంటూరు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ వరకు హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాకు చేరుకునేలా సర్వీసులు సిద్ధం చేశారు. 9వ తేదీన హైదరాబాద్ నుంచి గుంటూరుకు 15 బస్సులు, తెనాలి 1, పొన్నూరుకి 2 సర్వీసులు అందుబాటులో ఉంచారు. అలానే 10న గుంటూరుకు 28, తెనాలికి 3, మంగళగిరికి 4, పొన్నూరుకు 5 బస్సులు ఉంచారు. రద్దీకి అనుగుణంగా 13 వరకు 143 సర్వీసులు ఏర్పాటు చేశారు. పండగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణికుల కోసం 15వ తేదీ రాత్రి నుంచే స్పెషల్ బస్సులను సిద్ధం చేస్తున్నారు. 19వ తేదీ వరకు పండగ రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు ఉంచుతామన్నారు.

స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే..



సంక్రాంతి పర్వదినానికి సంబంధించి జిల్లాలో ఎక్కడా ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రద్దీ ఉన్న డిపోల్లో అదనపు సర్వీసులు ఉంచుతున్నాం. అంతేగాక గతంలో మాదిరి స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలతోనే ప్రయాణించేలా ఆర్టీసీ సంస్థ నిర్ణయం తీసుకుంది. భద్రతతో కూడిన ఆర్టీసీ బస్సులను ప్రజలు ఆదరించాలి. ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించాం.

\- డీపీటీవో రవికాంత్

ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే నరేంద్ర సీరియస్



జేసీతో సమావేశమైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో పండిన ధాన్యం అంతా రైతుల వద్దే ఉంది. అక్కడి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం నిల్వలతో నిండిపోయాయి. అధికారులు అత్యుత్సాహంతో పక్క నియోజకవర్గాల పంటను కొనుగోలు చేయటంతో స్థానిక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పొన్నూరులో సమావేశం నిర్వహించి అధికారుల తలంటినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో ఆయన మరింత సీరియస్ అయ్యారు. సోమవారం ఈ విషయంపై మాట్లాడేందుకు గుంటూరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. జాయింట్ కలెక్టర్‌తో భేటీ అయ్యారు. విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అధికారులు ఈ విషయంలో సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

గుంటూరు మీదుగా మరో నాలుగు సంక్రాంతి స్పెషల్స్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా మరో నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ .శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07615 కాచీగూడ - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07616 శ్రీకాకుళం రోడ్డు - కాచీగూడ రైలు ఈ నెల 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదుగా మరుసటి రోజు ఉదయం 7.35కి కాచీగూడ చేరుకొంటుంది. నంబరు. 07617 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 8న రాత్రి 7.20కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07618 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

10 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు(లీగల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాదిని పోలీసులు చిత్రహింసలకు గురిచేయటాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టుల్లో తమ విధులను బహిష్కరించి నిరసన తెలపాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షతన గుంటూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. క్రిస్మస్ సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు పొన్నూరుకు చెందిన దళిత న్యాయవాది బేతాళ ప్రకాశరావు ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ ఫిరోజ్ఖాన్ ప్రోద్బలంతో అతన్ని ఆస్పత్రి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి సీఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్ కుమార్, కానిస్టేబుళ్లు గోపి, మాధవ గోపి, స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావులు చిత్రహింసలు పెట్టారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. సంబంధిత డాక్టర్, పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత వారం ఆందోళన ఫలితం గా ఎస్ఐపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. సీఐ రవి కిరణ్ , డాక్టర్ ఫిరోజ్ ఖాన్‌లపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఎస్ఐ మీద నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు మార్చాలని బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ సంఘటనపై ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు, మానవ హక్కుల సంఘానికి, డాక్టర్‌పై చర్యలకు మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు విధులకు గైరా జరు కావాలని తీర్మానించారు.

పింఛన్ల పంపిణీపై వ్యాఖ్యలు అర్థరహితం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి పింఛన్ల పంపిణీపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారి ఏడు నెలలు గడుస్తున్నా కాకర్ల వెంకటరామిరెడ్డికి వైసీపీ వాసన పోలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించనప్పుడు ఏనాడు నోరు మెదపలేదన్నారు. పింఛన్ తీసుకునే ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు అనేది కూటమి ప్రభుత్వ ఉద్దేశం అని, అందుకే ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారిగా కాకర్ల వెంకటరామిరెడ్డి ప్రవర్తించాలని, గతంలో పింఛన్ల పంపిణీకి కొన్ని వేల మంది సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం ఉపయోగించిందన్నారు. సచివాలయ ఉద్యోగులను ఏమాత్రం ఇబ్బంది పెట్టకుండా పింఛన్ ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. కూటమి ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, వాసిరెడ్డి రవీంద్ర, కొలికొండ కొండలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి కూలీ మృతి

వినుకొండటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చాట్రగడ్డపాడు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా వేల్పూరు నుంచి నూజెండ్ల మండలం కంభంపాడుకు ఫెన్సింగ్ రాళ్లను ట్రాక్టర్‌లో తీసుకువచ్చారు. వాటిని పొలంలో వేసి తిరిగి వేల్పూరు వెళ్తుండగా చాట్రగడ్డపాడు సమీపంలో ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో ఉన్న కూలీ గాండ్ల నరసింహారెడ్డి (65) అక్కడికక్కడే మృతి చెందగా, ట్రాక్టర్ డ్రైవర్ చల్లా సాయితోపాటు ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న బైరెడ్డి రఘుబాబు, బండి కోటినాగులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాలను ప్రైవేటు వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఆత్మహత్య

రేపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాల వలన పట్టణంలోని ఇసుకపల్లికి చెందిన నంద్యాల రాజేంద్ర (40) సోమవారం ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అతని భార్య శివనాగలక్ష్మి చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా, మృతి చెందినట్లు డాక్టర్‌లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఆడపిల్లలు ఉన్నారు.

సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 567.50 అడుగులు ఉంది. ఇది 250.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,293 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 50,430 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119.127.137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

67,835 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 75,348 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 67,835 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,894 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7200	13500	334	8000	14300
నెంబరు. 5	7500	10000	నెంబరు.5	8500	9500
273	10500	10500	273	10000	12000
341	7500	15000	341	7500	13500
4884	9500	9500	4884	--	--
సూపర్ 10	11200	11200	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	16200	తేజ	7500	15500
బ్యాడిగి	7500	14000	బ్యాడిగి	7500	11500
దేవనూరు డీలక్స్	8500	14500	దేవనూరు డీలక్స్	10000	10000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9000

సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు

• ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు • ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న సంతూర్ ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)తో పాటు జీఎస్ఆర్ బిల్డర్స్ అధినేత గుండ్రెడ్డి శివ సౌజన్యంతో సోమవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వెనక ఉన్న రోడ్డులో ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 114 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గులను మహిళలు వేశారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ చిన్నారులతో పాటు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల విదార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీల ప్రారంభానికి విచ్చేసిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ చిన్నారులతో ముచ్చటించడంతో పాటు ముగ్గులు వేయడానికి పిల్లలు చూపిస్తున్న ఆసక్తిని కలెక్టర్ మెచ్చుకున్నారు. గతేడాది ముగ్గుల పోటీలకు వచ్చిన వారి సంఖ్య 80 మంది కాగా ఈ ఏడాది ఆ సంఖ్య 114కు చేరడం శుభపరిణామమనే అభిప్రాయాన్ని పలువురు వెలిబుచ్చారు. అంతే కాకుండా పోటీల్లో పాల్గొన్న వారిలో దాదాపు 40 శాతం మంది వరకు యువతులే ఉండడం గమనార్హం. 114 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొనగా ఇందులో 25 వరకు రంగవల్లులు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇచ్చిన రెండు గంటల వ్యవధిలోనే ముగ్గులను ఇంద్రధనస్సులాగా తీర్చి దిద్దడంతో వీటిలో నుంచి విజేతలను ఎంపిక చేయడానికి జడ్జీలుగా వ్యవహరించిన వారు చాలా కష్టపడాల్సి వచ్చింది.



పోటీలో పాల్గొనడానికి వచ్చిన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రత్యేక ఆకర్షణగా ఏఎస్‌పీ దంపతులు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించడానికి ఏఎస్‌పీ విఠలేశ్వర్ సతీమణి దేవీ పద్మజతో కలిసి వచ్చి ముగ్గులు వీక్షించి పోటీల్లో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తన సతీమణికి కూడా ముగ్గులంటే ఆసక్తి అని తాను గతంలో కూడా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు అతిథిగా హాజరయ్యానని, మళ్లీ ఇక్కడ బాపట్లలో ఇద్దరం వచ్చి బహుమతులు అందించడం ఆనందంగా ఉందని ఏఎస్‌పీ అన్నారు. రెండు గంటల సేపు ఓపిగ్గా ఇంత అందమైన ముగ్గులు వేసిన అందరికీ జేసీ ప్రఖర్‌జైన్ అభినందనలు అందించారు. ఏలూరి రత్నకుమారి, గంటా జ్యోతి, లక్ష్మీపార్వతిలు ముగ్గుల పోటీలకు జడ్జిలుగా వ్యవహరించారు.



ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ముగ్గుల పోటీలలో విద్యార్థినుల ప్రతిభ

బాపట్లరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయం రహదారిపై ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విశేషంగా విద్యార్థినులు పాల్గొని ముగ్గులను వేశారు. చిన్నారులు వేసిన వాటిలో మంచి ముగ్గులను న్యాయనిర్ణేతలు గుర్తించి పలువురికి ప్రోత్సాహక నగదును అందజేశారు.

ముగ్గులు వేయటం చాలా ఇష్టం



చిన్నప్పటి నుంచి ముగ్గులు వేయటం చాలా ఇష్టం. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహించినా పాల్గొంటాను.

- ఎల్.మనశ్విని, బాపట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని

'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి కృతజ్ఞతలు



నేను వేసిన ముగ్గుకు ప్రోత్సాహక బహుమతి అందించటం చాలా సంతోషంగా ఉంది. చిన్నారులకు కూడా ముగ్గుల పోటీలలో అవకాశం కల్పించటంతో మాలోని కళను గుర్తించిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి కృతజ్ఞతలు.

- పి.వెన్నెల వర్షిణి, బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని.



పోటీలో పాల్గొన్న మహిళకు కాంప్లిమెంట్ అందిస్తున్న జడ్జి ఏలూరి రత్నకుమారి



కళాశాల విద్యార్థినికి కన్సోలేషన్ అందిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్



మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్



కన్సోలేషన్ బహుమతి అందిస్తున్న ఏఎస్‌పీ విఠలేశ్వర్



ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న బిల్డర్ గుండ్రెడ్డి శివ



ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గులను తిలకిస్తున్న ఏఎస్‌పీ దంపతులు



ముగ్గులను తిలకిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

క్రైం కార్నర్

వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

• నగదు, మూడు సెల్‌ఫోన్‌లు దొంగతనం

బాపట్లరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి అతని వద్ద నుంచి రూ.1500 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు దొంగతనానికి పాల్పడిన ఘటన సోమవారం అప్పికట్ల సమీపంలోని కొండుభొట్లవారిపాలెం రోడ్డు వద్ద చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రామానికి చెందిన వాసు అనే వ్యక్తి తన లారీలో ఊకను వేసుకొని దుగ్గిరాలకు వెళుతుండగా కొండుభొట్లపాలెం రోడ్డు వద్ద నలుగురు వ్యక్తులు అతనిని ఆపి అతని వద్ద ఉన్న రూ.1500 నగదు, మూడుసెల్‌ఫోన్‌లను దొంగతనం చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

రౌడీయిజానికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రౌడీయిజానికి పాల్పడిన ఆరుగురిపై పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బాపట్ల పట్టణం ధరివాదకొత్తపాలేనికి చెందిన మేడిబోయన భవన్‌రెడ్డి, నాయుడు త్రినాధ్‌రెడ్డి, కోకి రవీంద్రరెడ్డిపై ఆసోది గాంధీభవన్‌రెడ్డి, పిట్టు వేణుగోపాల్‌రెడ్డి, కోట రామిరెడ్డి, అక్కల జగన్‌రెడ్డి, గోలమూరి బ్రహ్మారెడ్డి, అరవ మురళీకృష్ణారెడ్డి అనే ఆరుగురు రౌడీయిజానికి పాల్పడటంతోపాటు ఆ ముగ్గురిని దూషించటం, చంపేస్తాం అని బెదిరించటం జరిగిందని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై...

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం ధరివాదకొత్తపాలేనికి చెందిన ఆసోది గాంధీభవన్ రెడ్డి, పిట్టు వేణుగోపాల్‌రెడ్డిలు అదే గ్రామానికి చెందిన మరుప్రోలు భూపాల్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు భూపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. తన గృహం ముందు బైక్ పార్క్ చేస్తుండగా గాంధీభవన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి కారులో వచ్చి నా బైక్‌ను ఢీకొట్టి నాపై దాడికి పాల్పడ్డారని అన్నారు. ఈ ఘటనలో తనకు గాయాలవ్వటంతో బాపట్ల ఏరియావైద్యశాలకు వచ్చి చికిత్స తీసుకుంటూదాడికి పాల్పడ్డ ఇద్దరిపై అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏరియా వైద్యశాల అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నదీముల్లాపాలెంలో రేషన్ దుకాణం సీజ్



రేషన్ దుకాణాన్ని సీజ్ చేస్తున్న సీఎస్‌డీటీ ఫణికుమార్, వీఆర్వో అరుణ ప్రసన్న

పిట్టలవానిపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణంలో ఉండాల్సిన సరుకులు తరుగుగా ఉన్న విషయాన్ని బాపట్ల నియోజకవర్గ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సీఎస్ఎల్ ఫణికుమార్ సందర్శించి తనిఖీ చేశారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామపంచాయతీలోని నదీముల్లాపాలెం గ్రామంలోని చెట్టుపల్లి సురేష్‌నాథ్‌కు సంబంధించిన 9వ నెంబరు రేషన్ దుకాణాన్ని సోమవారం చందోలు-2 సచివాలయ వీఆర్వో అరుణ ప్రసన్నతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సీఎస్ఎల్ ఫణికుమార్ మాట్లాడుతూ రేషన్ దుకాణంలో ఉండాల్సిన రేషన్ 114 క్వింటాళ్ళు, పంచదార 198 ప్యాకెట్లు, కందిపప్పు 47 ప్యాకెట్లు తరుగుదల ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రేషన్ దుకాణాన్ని సీజ్ చేసి యాజమాని చెట్టుపల్లి సురేష్‌నాథ్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

వృద్ధ మహిళపై హత్యాయత్నం

బాపట్ల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వృద్ధ మహిళపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మూలపాలెం గ్రామానికి చెందిన బోడెమ్మ అనే వృద్ధ మహిళ ఆదివారం రాత్రి తన గృహం నుంచి బయట కొచ్చి తిరిగి ఇంట్లోకి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గృహంలోకి ప్రవేశించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆమె భర్త అప్రమత్తం కావటంతో ఆ వ్యక్తి పరారయ్యారన్నారు. ఈ ఘటనపై బాపట్ల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

• కలెక్టర్ జె.వెంకటమురళి



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో ఉద్యోగుల కుటుంబాల సభ్యుల హౌస్‌హోల్డ్ డేటాలో 1888 మంది నమోదు కాలేదన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్‌శాఖ, పోలీసుశాఖ, ప్రజాఆరోగ్యశాఖలో 1200 మంది సభ్యులు హౌస్ హోల్డ్ డేటాలో నమోదు కాలేదన్నారు. వెంటనే సంబంధితశాఖాధికారులు ఉద్యోగుల కుటుంబాల సభ్యుల వివరాలను హౌస్ హోల్డ్ సర్వే డేటాలో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమం కింద జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెన్షన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమోంటోలు, ప్రశంసపత్రాలతోపాటు నగదు పురస్కారం కూడా కలెక్టర్ అందజేశారు. అనంతరం బాపట్లకు చెందిన 16 మంది బృందం బధిరులు నెల్లూరులో క్రికెట్ పోటీల విజేతలు కప్ గెలుపొందినందుకు వారిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్, డీఆర్‌డీఏ ప్రాజెక్టుడైరెక్టర్ విజయలక్ష్మి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు సబ్‌ట్రెజరీ కార్యాలయానికి సంబంధించి సుమారు 1200 మంది పెన్షన్‌దారులు ఉన్నారని, పెన్షన్‌దారులు వేదిక నిర్మాణానికి నాలుగు సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. కొల్లూరుమండలం ఈపూరులంకకు చెందిన ఈపూరు నిర్మలకుమారి అన్నదమ్ములకు, కుటుంబసభ్యులకు ధ్రువీకరణపత్రం రద్దుపరచాల్సిందిగా కోరుతూ ఒక అర్జీ దాఖలు చేశారు. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు గణపవరం టీచర్ ఎంపిక

కర్లపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం ఎం.విరాజుపాలెం హైస్కూల్‌లో 3వ తేదీన జరిగిన సైన్స్ ఫెయిర్ డిస్ట్రిక్‌లో గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ సుధారాణికి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించిందని ప్రధానోపాధ్యాయుడు నూతలపాటి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు సైన్స్ టీచర్ సుధారాణి అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సైన్స్ టీచర్ సుధారాణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూరల్స్ పాటించాలి : పట్టణ సీఐ

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ రూల్స్ పాటించండి.. సురక్షితంగా గమ్యానికి చేరండని బాపట్ల పట్టణ సీఐ అహ్మద్‌జానీ అన్నారు. సోమవారం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడుతూ తలకు హెల్మెట్ ధరించకుండా ఎవరు వాహనాన్ని నడపకూడదన్నారు. అదేవిధంగా సైబర్ మోసాలు గురించి విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా సీఐ వివరించారు. ఎస్పీ తుషార్ డూడి, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో బాపట్ల పట్టణ పోలీసులు, సిబ్బంది ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

స్పెషల్ సమ్మరి రివిజన్ ఓటర్ల తుది జాబితా విడుదల



తహసీల్దార్ సుశీల

వేమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా వేమూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఓటర్ల తుదిజాబితాను నియోజకవర్గ తహసీల్దార్ సుశీల సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఐదు మండలాల ఓటర్ల వివరాలను వివరించారు. నియోజవర్గ స్థాయిలో మొత్తం ఓటర్ల సంఖ్య 1,98,015 కాగా వారిలో 566 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. 95,592 పురుషుల ఓట్లు ఉండగా, 1,01,841 మంది స్త్రీల ఓట్లు ఉన్నాయి. ఇతరుల ఓట్లు 16 ఉన్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

• టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.70 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం జరిగినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఆనందబాబు సహాయ సహకారాలతో విఠలేశ్వర స్వామి కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, అద్దేపల్లి దళితవాడ, భట్టిప్రోలు ఎస్‌సి కాలనీ తదితర ప్రాంతాల్లో ఒక్కొక్క ప్రాంతానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయించి సీసీ రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై కూడా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కలెక్టర్‌కు నివేదించడం జరిగిందని, వాటిపై కూడా త్వరలో విచారణ జరగనున్నట్లు చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో ధనుర్మాస వేడుకలు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని సాయిబాబా మందిరంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాలత్రిపురసుందరి భజన మండలి వారు బాబా వారి సంకీర్తనలతో పాటు ఆయన జీవిత చరిత్రను వివరించారు. రాత్రి వేళ స్వామి వారికి పల్లకీ, పవళింపు సేవలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అర్జీదారులకు త్వరితగతిన న్యాయం చేయాలి

• అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకొని బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీ ఆదేశించారు. సోమవారం ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన అర్జీదారుల రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించారు. వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై 37 అర్జీలు స్వీకరించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ సెల్ ఎస్సై శ్రీనివాసరావు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మంతేరు డ్రెయిన్‌కు మరమ్మతులు చేపట్టండి

పిట్టలవానిపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల, గ్రామస్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంతేరు డ్రెయిన్ ద్వారా పంట పొలాలు నీటమునిగి రైతాంగం పలు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత డ్రెయిన్‌ను రానున్న వ్యవసాయ కాలంలో మరమ్మతులు చేపట్టాలని ఆ ప్రాంత రైతాంగం, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధితశాఖాధికారులు రానున్న వ్యవసాయ తరణంలో ప్రభుత్వం పరంగా డ్రెయిన్‌ల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్ళి అభివృద్ధి చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పలు అంశాలపై ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, ఉప ఎంపీపీ చేబ్రోలు కృపానందం, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కర్లపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కర్లపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయం లో జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

నగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి):విద్యార్థినీ, విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని ఎస్వీఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం కళాశాలలో ఈనెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సోమనాథుని క్షేత్రం మనో యోగసాధన శిక్షణ తరగతులు వి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రత్నపాప బృందం వారు విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయటం వలన శారీరకంగానే కాకుండా మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ వివి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా చేసిన యోగ భావోద్వేగాలను నియంత్రించుకునేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, కళాశాల సూపరింటెండెంట్ అమరేంద్రరెడ్డి, టి.నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కరరావు

రేపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.భాస్కరరావు, సెక్రటరీగా డాక్టర్ వి.ప్రసాద్, ట్రెజరర్‌గా ఎం.అంకమ్మ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే అబ్దుల్‌కలాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు కె.భాస్కరరావు చెప్పారు.

పంతుళ్లపాలెం

ఉపాధ్యాయ వృత్తికి అంకితం !

- నాడు వివాదాలకు పెట్టింది పేరు
- నేడు ఉద్యోగాలకు నెలవు..
- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉపాధ్యాయులున్న గ్రామంగా గుర్తింపు
- ఒకే కుటుంబంలో ఆరుగురూ టీచర్లే !
- డీఎస్సీ శిక్షణలో 50 మందికి పైగా విద్యార్థులు



ఒకప్పుడు ఘర్షణలకు మారుపేరుగా నిలిచిన ఆ పాలెం నేడు అత్యధిక ఉపాధ్యాయులు కలిగిన గ్రామంగా ఎంపికైంది. చదువుతోనే తమ తలరాతలు మారుతాయని భావించిన ఆ యువత ఉపాధ్యాయ వృత్తిని ప్రధానంగా ఎంచుకొని జీవితంలో రాణిస్తున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు గడిచిన కొంత కాలంగా ఆ గ్రామంలో 30కి మందికి పైగా ఉపాధ్యాయులుగా ఎంపికై ఆ గ్రామ ఖ్యాతిని రాష్ట్ర నలుదిశలా వ్యాప్తిచేసి ఉమ్మడి గుంటూరు జిల్లాకి ఓ ప్రత్యేకతను తీసుకొచ్చారు. ఘర్షణలను, వివాదాలను తొసిపుచ్చి, విద్యలో రాణిస్తూ, ఉద్యోగాల్లో స్థిర పడుతున్న యువత ఏనుగు పాలెంగా ఉన్న ఆ గ్రామం పేరును నేడు పంతుళ్ల పాలెంగా మార్చివేశారు.



పీ. చినరామయ్య (2006 డీఎస్సీ స్టేట్ ఫస్ట్) | మేడిశెట్టి ఇందిరా (2012 డీఎస్సీ జిల్లా ఫస్ట్) | మేడిశెట్టి ప్రశాంత్ (2014 డీఎస్సీ జిల్లా ఫస్ట్)

వినుకొండటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాల్లోని వినుకొండ నియోజకవర్గం, వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామం అత్యధిక ఉపాధ్యాయులు కల్గిన గ్రామంగా గుర్తింపు సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఓ ప్రత్యేకతను చాటింది. 400 కుటుంబాలతో 1900 ఓట్లు కల్గిన గ్రామంలోని యువత ఉపాధ్యాయ ఉద్యోగాల సాధనలో ముందున్నారు. ఇప్పటికే 30కి మందికి పైగా ఉపాధ్యాయులుగానూ, ఫిజికల్ డైరెక్టర్లుగా ఉద్యోగాలు సాధించి ఏనుగుపాలెం గ్రామాన్ని పంతుళ్లపాలెంగా పిలిచేలా చేశారు.

డీఎస్సీ ఫలితాలు వచ్చాయంటే ఆ గ్రామం లోని యువత రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులతో ఆ గ్రామం పేరు వినపడాల్సిందే. మొదటి తరానికి చెందిన కొణిజేటి సైదులు మాస్టారు ఆ గ్రామంలో మొట్ట మొదటి ఉపాధ్యాయుడు. ఆయనను ఆదర్శంగా తీసుకొని మేడిశెట్టి నాగేశ్వరరావు మాస్టారు రెండవ తరంలో పట్టణంలోని లయోలా పాఠశాల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గ్రామంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ యువతకు ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఏర్పడేలా చేశారు. కుటుంబంలో ఆయన సతీమణి చిన్నమ్మతోపాటు పెద్ద కుమారుడు సుబ్బారావు ఆయన సతీమణి శ్రీలక్ష్మి, రెండవ కుమారుడు ప్రశాంత్, కుమార్తె ఇందిరా (2012 డీఎస్సీ జిల్లా ఫస్ట్ ర్యాంకు) ఇలా ఒకే ఇంట్లో ఆరుగురు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గుడిపూడి అంజయ్య డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా స్థిరపడ్డారు. ఆ కుటుంబంలోని సోదరులైన అంకారావు, గోవిందు, వెంకటేశ్వర్లు ఆయన సతీమణి సంధ్య ఒకే కుటుంబంలో ఐదుగురు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఇలా గ్రామంలో 30 మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం గమనార్హం. మరో 40 నుండి 50 మంది విద్యార్థులు డీఎస్సీలో శిక్షణ పొందుతూ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు.



గ్రామంలోని మొట్టమొదటి ఉపాధ్యాయుడు కొణిజేటి సైదులు మాస్టారు



ఉపాధ్యాయులైన మేడిశెట్టి నాగేశ్వరరావు మాస్టారు కుటుంబ సభ్యులు

ఆరుగురు వ్యాయామ ఉపాధ్యాయులు

గ్రామంలోని పాపసాని చిన్నరామయ్య (2006 డీఎస్సీలో స్టేట్ ఫస్ట్), గణప వీరాంజి (2012 డీఎస్సీలో జిల్లా ఫస్ట్), మేడిశెట్టి ప్రశాంత్ (2014 డీఎస్సీలో జిల్లా ఫస్ట్)లతోపాటు గుడిపూడి అంకారావు, గుంటూరు నరసరింహారావు, కాల్వ ఏసురాజులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉన్నారు. గణప వీరాంజి సతీమణి శివరాణి, తుంగ శ్రీనివాసరావు సతీమణి పుష్పలత, గుడిపూడి వెంకటేశ్వర్లు సతీమణి సంధ్యలు ఉపాధ్యాయులుగా ఉన్నారు.

ఏనుగుపాలెం గ్రామంలోని ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి ఉపాధ్యాయులందరూ నాడు గ్రామంలోని సాధారణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో విద్యనభ్యసించిన అనంతరం సుమారు మూడు కిలోమీటర్ల మేరకు నడుచుకుంటూ పెదకంచర్లలోని జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి వరకు చదువుకున్న వారే. గ్రామానికి చెందిన గుడిపూడి ప్రశాంత్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులందరూ గ్రామ అభివృద్ధికోసం తమవంతు సహాయసహకారాలను అందజేస్తున్నారు. ఉద్యోగులంతా కలిసి సుమారు రూ.కోటిన్నర ఖర్చుతో రామాలయం నిర్మించారు. జనవరి 26న ఆలయ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమ నిర్వహణకు సన్నహాలు చేస్తున్నారు.

అనర్హుల ఏరివేతకు

రంగం సిద్ధం

- దివ్యాంగుల పింఛన్లపై మొదలైన విచారణ
- 702 మంది ఇళ్లవద్దకు వెళ్లనున్న వైద్య బృందాలు
- ముందు రోజే నోటీసు.. ఆ తర్వాత పరీక్షలు



పిడుగురాళ్ల మండలం గుత్తికొండలో సోమవారం పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు, కార్యదర్శులు

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):నకిలీ దివ్యాంగుల పింఛన్‌లకు చెక్ పెట్టేందుకు రంగ సిద్ధం అయ్యింది. గత ప్రభుత్వం హయాంలో గ్రామ, వార్డు సచివాలయంలో రూ. 10 వేలు మామూళ్లు చెల్లించి నకిలీ వికలాంగుల సర్టిఫికెట్ పొందిన వారికి ఇబ్బంది రానుంది. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ద్వారా రూ. 15 వేలు పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందాలు వెళ్లనున్నాయి. ఈ నెల 6వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జిల్లాలోని 702 మంది ఇళ్లకు ఈ బృందాలు వెళ్లనున్నాయి. వారంలో మూడు రోజుల పాటు వైద్య బృందాలు పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా నిపుణులు అయిన వైద్యులతో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన డాక్టర్స్ కమిటీలో ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజీషియన్, సంబంధిత ఏరియా మెడికల్ ఆఫీసర్లు సభ్యులుగా ఉంటారు. వీరికి సహాయంగా ఒక డిజిటల్ అసిస్టెంట్ కూడా ఉంటారు. ఈ బృందం ప్రతి రోజు 25 మంది పింఛన్ దారులను వారి ఇళ్ల వద్దే పునః పరిశీలించి ధ్రువీకరిస్తారు. నిర్ణయించబడిన షెడ్యూల్ కన్నా ఒక రోజు ముందే లబ్ధిదారులకు నోటీసులు ఇస్తారు. వైద్య బృందాలను, మండల పరిషత్, మునిసిపల్ అధికారుల మధ్య సమన్వయం చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా..

జిల్లాలో రూ. 15 వేలు పొందుతున్న పింఛన్లు పొందున్న దివ్యాంగుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. చేబ్రోలు మండలంలో 34 మంది, దుగ్గిరాల మండలంలో 22 మంది, గుంటూరు టోటల్ 15, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 82 మంది, కాకుమాను మండలంలో 22, కొల్లిపొర మండలంలో 24, మంగళగిరిలో 42, మంగళగిరి మునిసిపాలిటీలో 5 మంది, మేడికొండూరు మండలంలో 30, పెదకాకాని మండలంలో 34, పెదనందిపాడు మండలంలో 40, ఫిరంగిపురం మండలం లో 59 మంది, పొన్నూరు మండలంలో 30, పొన్నూరు మునిసిపాలిటీలో 18 మంది, ప్రత్తిపాడు మండలంలో 28, తాడేపల్లి మండలంలో 15 మంది, తాడేపల్లి మునిసిపాలిటీ లో 12, తాడికొండ మండలంలో 32, తెనాలి మండలంలో 48 మంది, తెనాలి మునిసిపాలిటీలో 29 మంది, తుళ్లూరు మండలంలో 47 మంది, వట్టిచెరుకూరు మండలంలో 34 మంది చొప్పున రూ. 15 వేలు పెన్షన్ పొందుతున్నారు.

అన్నీ బాగున్నా వికలాంగులే..

తాడికొండ మండలంలో ఒక వ్యక్తి రెండు కాళ్ళు లేవని పింఛన్ పొందుతున్నాడు. కానీ అతను రెండు కాళ్ళు బాగానే ఉన్నాయి. సైకిల్ కూడా బాగానే తొక్కుతాడు. అదే మండలంలో మరొకరికి కళ్ళు బాగానే కనపడినా చూపు లేదని సర్టిఫికెట్ ఇచ్చారు. ఇలా ప్రతి చోట అనర్హులకు రూ. 15 వేలు పింఛన్ ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి నకిలీ సర్టిఫికెట్‌లు సచివాలయం ద్వారానే మంజూరు అయ్యాయి.ం్హ. 10 వేలు ఇస్తే చాలా చోట్ల సచివాలయం సిబ్బంది ఇటువంటి సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. ప్రస్తుతం డాక్టర్ల బృందం ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పరీక్షించి నిజమైన దివ్యాంగులా? కాదా అన్న విషయాన్ని నిర్ధారిస్తున్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో

మరో 159 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థుకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో మరో 159 మంది తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. దేహదారుఢ్య పరీక్షలకు 331 మంది హాజరవగా, వారిలో 43 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 288 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 14 బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడం వల్ల తిరస్కరణకు గురయ్యారు. మిగిలిన 274 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 105 మంది విఫలమవ్వగా, 169 మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు. 169 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 21 మంది అర్హత సాధించగా 148 మంది విఫలమయ్యారు. 169 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 159 మంది అర్హత సాధించారు. 10 మంది విఫలమయ్యారు. మొత్తం 288 మంది మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 159 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. మహిళా కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

వైభవంగా

వేడుక

- భక్తి శ్రద్ధలతో ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవం
- సమష్టి దివ్య పూజాబలిలో
- పాల్గొన్న బిషప్‌లు
- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవ భక్తులు



పెదకూరపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సోమవారం ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రధానార్చకులుగా వ్యవహరించగా ముఖ్య ప్రసంగీకులుగా శ్రీకాకుళం పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ రాయరాల విజయ కుమార్ ప్రసంగించి ముగ్గురు రాజుల దేవాలయ విశిష్టతను వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పీఠాధిపతులు రెవరెండ్ డాక్టర్ గాలి బాలి కడప, విజయవాడ పీఠాధిపతులు డాక్టర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, కర్నూలు పీఠాధిపతులు డాక్టర్ గోరంట్ల జ్వానేష్, వరంగల్ పీఠాధిపతులు డాక్టర్ ఉడుముల బాల, నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం, ఖమ్మం పీఠాధిపతులు డాక్టర్ ప్రకాష్ సాగిలి, నెల్లూరు పీఠాధిపతులు డాక్టర్ పిల్లి ఆంతోని దాసు, నల్గొండ పీఠాధిపతులు డాక్టర్ కే దమన కుమార్, డాక్టర్ గోవిందు జోజి, స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిని హృదయ రాజు, సహాయ గురువు నందిగామ సురేష్‌లు ప్రత్యేక ప్రసంగాలు, పూజలను నిర్వహించారు. పాటిబండ్ల గ్రామానికి చెందిన దేశ, విదేశాల్లో స్థిర పడిన వారు ఈ శత వార్షికోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన విచారణ గురువులు, మత కన్యలు, వేలాది మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



ఆలయ శతవార్షికోత్సవానికి హాజరైన పీఠాధిపతులు



ముగ్గురు రాజుల దేవాలయ శతవార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న శ్రీకాకుళం పీఠాధిపతులు డాక్టర్ రాయర్ల విజయ కుమార్



శృంగారపురం బెల్లంతో

అరిసెలు అదుర్స్ !

సంక్రాంతి వస్తుందంటే గుర్తుకొచ్చేరి అరిసెలు, అరిసెల తయారీకి ముఖ్యంగా కావలసింది బెల్లం. బెల్లం సరయినది అయితేనే అరిసెల పాకం బాగా వచ్చి, మంచి రుచిగా వస్తాయి. డెల్టా ప్రాంతంలో నాణ్యమైన బెల్లానికి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం శృంగారపురం కేరాఫ్ అడ్రస్‌గా పేరొందింది. ఈ ఈ ప్రాంతం వారు నగరాలకు వెళ్లినా, విదేశాలకు వెళ్ళినా సంక్రాంతి వస్తుందంటే అమ్మమ్మ, నాయనమ్మలు మనుమలు, మనుమ రాండ్లకు తినిపించే పిండివంటల కోసం బెల్లం కావాలంటే శృంగారపురం గ్రామాన్ని వెతుక్కుంటూ రావల్సిందే.



కళాయిలో బెల్లం ఊటను కలియబెడుతున్న రైతు

దుగ్గిరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తుందంటే గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని శృంగారపురం గ్రామంలోని బెల్లం తయారీ కేంద్రాలు కిటకిటలాడుతుంటాయి. ఇక్కడ సహజ వ్యవసాయపద్ధతుల్లో పండించిన చెరకుతో గత 70ఏళ్లుగా మూడుతరరాలు బెల్లం తయారు చేసి నాణ్యమైన బెల్లాన్ని అందిస్తున్నారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా, స్థానికంగా పండించిన నాటు చెరకుతోనే, బెల్లం తయారీ ఇక్కడ ప్రత్యేకం. ఎప్పటికప్పుడు అవసరమైన మేరకు చెరకు గడలు నరికి క్రషర్‌లో వేసి తీసిన స్వచ్ఛమైన చెరకురసంతో బెల్లం తయారు చేస్తున్నారు. అచ్చులుగా పోసి వాటిని పేర్చి ఒక్కోబాక్స్ 22కిలోలు చొప్పున, 33.6కిలోల బరువుండే బెల్లం బుట్టలలో పేర్చి క్రషర్ వద్దే విక్రయిస్తున్నారు. అరిసెలు, బూరెలు, జిలేబీ తయారీకి ప్రధానంగా వినియోగించే బెల్లం తయారీకి శృంగారపురం శాశ్వత చిరునామాగా మారింది. ఎంతో పేరొందిన, తెనాలి సత్యనారాయణ టాకీస్ రోడ్డులోనూ, వడ్లపూడి, రేవేంద్రపాడు గ్రామాల్లో దుకాణాల్లో లభించే జిలేబీ శృంగారపురం బెల్లంతోనే తయారు చేస్తారని చెప్పడం విశేషం.

ధర కొంచెం ఎక్కువైనా..

గత కొద్దికాలంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇదివరలో 200 ఎకరాలకు పైగా ఉన్న చెరకు పంట విస్తీర్ణం 20ఎకరాలకు చేరుకోగా 30కిపైగా ఉన్న బెల్లం క్రషర్‌ల సంఖ్య మూడుకు చేరుకుంది. కాలక్రమంలో బెల్లం వాడకం కంటే పంచదార వాడకం పెరగడంతో బెల్లంకు డిమాండ్ తగ్గింది. గిట్టుబాటు కానప్పటికీ పెద్దల అడుగుజాడల్లో నడుస్తున్న కొద్దిమంది చెరకు రైతులు మాత్రం బెల్లం తయారీ కొనసాగిస్తూ వచ్చారు. దీపావళి నుండి సంక్రాంతి వరకూ కేవలం ఏటా రెండు నెలలపాటు మాత్రమే శృంగారపురంలో బెల్లం తయారు చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో బెల్లం ధర కిలో రూ.80ల వరకూ ఉండగా, ఎలాంటి కెమికల్స్ కలపని ఇక్కడి బెల్లం, ధర మాత్రం రూ.110 నుంచి రూ.130లకు విక్రయిస్తున్నారు.

కూలీల కొరతతో తగ్గిన తయారీ..

గతంలో బెల్లం తయారీ కూలీలు వందల సంఖ్యలో ఉండగా పరిసరగ్రామాల్లో ప్రస్తుతం బెల్లం వండే కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. కూలీల కొరతతో శ్రీకాకుళం, గోదావరి జిల్లాల నుంచి వలస వచ్చిన కూలీలతో బెల్లం తయారీ క్రషర్‌లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారు చేసే బెల్లానికి గిరాకీ ఎక్కువగా ఉన్నప్పటికీ గిట్టుబాటు కాక పోవడంతో సంప్రదాయంగా మాత్రమే బెల్లం తయారు చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా లాభాపేక్ష లేకుండా ఆనవాయితీ పోనివ్వకుండా పెందుర్తి రవికాంత్, యలవర్తి అంకారావు తదితర కొద్ది మంది రైతులు మాత్రమే బెల్లం తయారీ క్రషర్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ విక్రయించే బెల్లం పాకం సీసాలు టీ, కాఫీల్లోనూ పంచదారకు బదులుగావినియోగించ వచ్చునని చెప్పడం విశేషం.



చెరకుతో వండి సిద్ధం చేసిన బెల్లం బుట్టలు





ఆరబెట్టిన బెల్లం అచ్చులు

అగ్రవర్ణాల్లోని పేదలకూ సబ్సిడీ రుణాలు

బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు

జిల్లాకు 568 యూనిట్లు కేటాయింపు

8 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు నగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల తరహాలోనే అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను ఇవ్వనుంది. వారు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునేందుకు అవకాశం కల్పించింది. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రుణాలను మంజూరు చేయనుంది. 50శాతం సబ్సిడీ ప్రకటించింది. జిల్లాకు మొత్తం 568 యూనిట్లను కేటాయించింది. వీటిలో స్వయం ఉపాధి యూనిట్లు 483, జనరిక్ మందుల దుకాణాలు 85 ఉన్నాయి. జనరిక్ మందుల దుకాణాలకు యూనిట్ విలువ రూ.8 లక్షలు కాగా ఇందులో రూ.4 లక్షలు సబ్సిడీ ఉంటుంది. మిగిలిన సొమ్మును లబ్ధిదారుడు బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కులాల వారీగా ఎవరికి ఎన్ని అన్నది కూడా నిర్ణయించింది.

ఈబీసీలకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. 16వతేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందన్నారు. అనంతరం వచ్చిన వాటిని పరిశీలించి, ఇతర అభ్యంతరాలను పూర్తిచేసి ఫిబ్రవరిలో గౌండింగ్ ప్రక్రియను చేపడతామని ఆయన తెలిపారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు

మార్కాపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామచెరువును ఆక్రమించి అక్రమంగా ఏర్పాటు చేసిన ఇటుకల బట్టీలను సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవిలు, రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం తొలగించారు. రాయవరం గ్రామ చెరువు 203 సర్వే నెంబర్‌లో 62 ఎకరాలలో ఉంది. అందులో సుమారు 20 ఎకరాలను గ్రామ వైసీపీ నాయకులు ఆక్రమించి మూడు ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. యథేచ్ఛగా అక్కడే వ్యాపారాలు చేస్తున్నారు. గ్రామసమీపంలో నివాస ప్రాంతాలలో ఇటుకల బట్టీలు నిర్వహించకూడదని తెలిసినా గత ప్రభుత్వంలో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారు. వైసీపీ నాయకుల అండతో చెరువును ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి పరిశీలించి ఎక్స్‌కవేటర్ యంత్రంతో ఆక్రమణలను తొలగించారు. పదిహేను రోజుల క్రితమే చెరువు భూమిలో అక్రమంగా ఏర్పాటుచేసిన ఇటుకల బట్టీలను తొలగించారు.

కచ్చితమైన సమాచారం కావాలి

ఎస్సీ ఉపకులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ఒంగోలునగరం, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఎస్సీలోని ఉపకులాలకు చెందిన ఖచ్చితమైన సమాచారం అందించాలని ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను కోరారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఆయన సోమవారం ఉదయం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై గణాంకాలతో సమగ్రంగా వివరాలను అందజేయాలని కోరారు. రాజకీయంగా కూడా ఎస్సీల స్థితిగతులను కమిషన్ పరిశీలన చేస్తుందన్నారు. ఎస్సీల లబ్ధిదారుల్లో ఉప వర్గాలను కూడా పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా స్థాయిలో ఎస్సీల్లోని 59 ఉప కులాల పరిస్థితులపై అధ్యయనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలు, కేడర్, ఉపకులాల వారీగా ఖచ్చితమైన సమాచారం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పూర్వపు ప్రకాశం జిల్లాలో మొత్తం 56 మండలాలు ఉండగా ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ బాపట్ల జిల్లాలో 13 మండలాలు, నెల్లూరు జిల్లాలో ఐదు మండలాలు కలిపారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 38 మండలాలు ఉన్నాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పూర్వపు జిల్లాలో 33,97,448 మంది జనాభా ఉండగా ఇందులో ఎస్సీ జనాభా మొత్తం 7,87,861 మంది ఉన్నారని వివరించారు. అందులో పురుషులు 3,97,861 మంది, స్త్రీలు 3,90,619 మంది ఉన్నారన్నారు. ఎస్సీ అక్షరాస్యత జనాభా మొత్తం 4,10,946 కాగా అందులో పురుషులు 2,40,551 మంది, స్త్రీలు 1,70,395 మంది ఉన్నారని తెలిపారు. ఎస్సీల అక్షరాస్యత శాతం 59.75 ఉండగా అందులో పురుషుల శాతం 69,50 కాగా స్త్రీల శాతం 49.86గా ఉందన్నారు. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల్లో కలిపి ఉద్యోగులు 36,669 మంది ఉన్నారని, అందులో మాలలు 21,789 మంది, మాదిగలు 14,770 మంది, ఇతర ఉపకులాలు వారు 160మంది ఉన్నారని వివరించారు.

ఇసుక దందా, అనధికారిక లేఅవుట్లను ఉపేక్షిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, అనధికారిక లేఅవుట్లపై ఉపేక్షిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లకు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరం ప్రాంగణంలో సోమవారం వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్లు, ఇసుక దందాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లదేనన్నారు. విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ఈ దందాలను అరికట్టకుండా, ఉన్నతాధికారులకు తెలపకుండా వ్యవహరిస్తే అది ఉద్దేశపూర్వక తప్పుగా భావించి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రభుత్వ భూములు, స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వ ఆస్తి ఎక్కడా పరాధీనం కాకూడదని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలలో భారత్ సత్తా చాటాలి

అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య

ప్రపంచ కప్ ఖోఖో పోటీల లోగో ఆవిష్కరణ



ఖోఖో పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ గరటయ్య, సీతారామిరెడ్డి

పంగులూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ స్థాయి ఖోఖో పోటీలలో భారత్‌జట్టు సత్తా చాటి విజేతగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బీసీహెచ్ గరటయ్య ఆకాంక్షించారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ అకాడమీలో ఢిల్లీ కేంద్రంగా నిర్వహించబోతున్న ప్రపంచ కప్ ఖోఖో పోటీల లోగోను సోమవారం డాక్టర్ గరటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంగులూరులో ఖోఖో క్రీడకు ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. మూడున్నర దశాబ్దాలుగా పంగులూరు కేంద్రంగా ఖోఖో క్రీడకు లభించిన ఆదరణ, స్థానికంగా రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. ఖోఖో అన్ని క్రీడలకూ తల్లి వంటిదన్నారు. ఖోఖో క్రీడాకారులను తీర్చి దిద్దడంలో పంగులూరు ఓ ఖార్ఖానాగా పేరు గడించిదని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వందలాది మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించగా, పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొని పతకాలను సాధించారని గుర్తు చేశారు. క్రీడల్లో రాణించిన ఎందరికో ఉపాధి చూపిన ఖోఖో కనిగిరి, ఈదర ప్రాంతాలలో విస్తరించేందుకు దోహద పడిందన్నారు. ఈ సందర్భంగా ఖోఖో లోగోతో పలువురు క్రీడాకారులు, పాఠశాల విద్యార్థులు గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, కోచ్ డీఎల్ రెడ్డి, రోటరీ ప్రతినిధులు రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, చిలుకూరి వీరరాఘవయ్య, హెచ్ఎం రమాదేవి, నేతలు జాగర్లమూడి సుబ్బారావు, రావూరి శ్రీనివాసరావు, ఐ.సుబ్బారావు పాల్గొన్నారు.

సంక్రాంతి సంప్రదాయాలు కనుమరుగు

గ్రామాలలో పెరిగిన క్రికెట్, షటిల్ పోటీలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



గంగిరెద్దు విన్యాసాలు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే గ్రామాలలో పండుగదనం ఉట్టిపడేలా సందడిగా ఉండేది. అయితే క్రమేపీ నాటి సంక్రాంతి సంబరాలు కనుమరుగు అవుతూ వస్తున్నాయి. గంగిరెద్దుల ఆటలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. గాలిపటాల రెపరెపలు మచ్చుకు కూడా లేవు. ఇక పశుసంపదకు పూజలు అసలే లేవు. బతుకుదెరువు కోసం కొందరు గంగిరెద్దుల వలే ఆవులను సింగారించి వీధుల్లో తిప్పుతూ పొట్ట పోసుకుంటున్నారు. ఇక ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు అక్కడక్కడా తళుక్కున మెరుస్తున్నాయి. పేడతో పెట్టే గొబ్బెమ్మల జాడే లేదు. అంతేగాక హరిదాసుల కీర్తనలతో గ్రామాలు ప్రతిధ్వనించేవి. నేడు వారు రాక కూడా తగ్గింది.

నాటి సంక్రాంతి సంబరాల స్థానంలో ప్రస్తుతం గ్రామాలలో సైతం క్రికెట్, షటిల్ పోటీలను నిర్వహిస్తున్నారు. గ్రామాలలో సైతం యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఇతర ప్రాంతాలలో స్థిరపడగా సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. అదే సమయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాల పేరుతో కలిసి చదువుకున్న వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.

అద్దంకి నియోజకవర్గంలో సంక్రాంతి మరింత సందడిగా ఉంటుంది. కొరిశపాడు మండలంలోని రావినూతలలో మూడు దశాబ్దాలుగా అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి క్రికెట్ టీమ్‌లు పాల్గొంటాయి. ఇదే బాటలో పంగులూరు మండలం కొండమంజులూరులో కూడా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్నారు. ఇక జిల్లా స్థాయి, రెండు, మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లను బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాలలో కూడా ఏటా నిర్వహిస్తున్నారు. ఇలా సంక్రాంతి సంప్రదాయం కాస్తా క్రికెట్ టోర్నమెంట్ వైపు మళ్లింది.



గ్రామాల్లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డ సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు సంక్రాంతికి కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వస్తుండడంతో సందడిగా మారుతున్నాయి. ఈ క్రమంలో నాడు చిన్నతనంలో కలిసి చదువుకున్న మిత్రులందరూ కలిసేందుకు ఉత్సాహం చూపుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సన్మానిస్తున్నారు. అలాగే పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. సంప్రదాయంగా చేసే సంక్రాంతి పండుగ క్రమక్రమంగా రూపం మార్చుకుని ఆధునికత వైపు నడుస్తోంది. అయినప్పటికీ ఇంకా కొన్నికొన్ని ఊళ్లలో అచ్చమైన సంక్రాంతి పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తుండడం గమనార్హం.

ఉపాధి సిబ్బందిపై కొరడా

అవినీతికి పాల్పడినవారిని సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు

రిజిస్టరు పోస్టు ద్వారా కార్యాలయానికి ..

పూర్వ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు

వీసీపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడిని ఉద్యోగులపై వేటు పడింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు అవినీతికి పాల్పడిన ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వులు రిజిస్టరు పోస్టు ద్వారా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చాయి. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 549 పనులకు 11.95 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు సంబంధించి 22పనులకు 1.25కోట్లు మొత్తం 12.26కోట్లు ఖర్చుచేశారు. ఈ పనులకు సంబంధించి సెప్టెంబరులో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మండలంలో చేపట్టిన ఉపాధి పనులలో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.సామాజిక తనిఖీ అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆడిట్ బృందం అధికారుల ఎదుట నివేదికలను వెల్లడించారు. మండలంలో 328పనులకు సంబంధించి రూ.61.77లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఈ అక్రమాలలో ఏపీవో సుబ్బారావు, కంప్యూటర్ ఆపరేటర్ షరీఫ్, టీఏలు వీరాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వై.శేఖర్ కిషోర్, వెంకటేశ్వర్లుతో పాటు ఈసీ సత్యనారాయణను బాధ్యులను చేస్తూ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించడంతోపాటు నేరుగా తన ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని పీడీ జోసెఫ్‌కుమార్ నోటీసులు పంపించారు. ఎంపీడీవో కార్యాలయానికి పోస్టు ద్వారా వచ్చిన ఈ నోటీసులను సస్పెండ్ అయిన ఉద్యోగులు అందుకున్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగిన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పనిచేసిన 18మందికి వారిపై నమోదైన అభియోగాలకు వివరణ ఇవ్వడంతో పాటు రికవరీ చెల్లించాలని షోకాజ్ నోటీసులు జారీచేశారు.

శీనారెడ్డి అక్రమాలపై ఇంటెలిజెన్స్ దృష్టి

పలువురి నుంచి వివరాలు సేకరణ

ఇప్పటికే కొనసాగుతున్న త్రిసభ్య కమిటీ విచారణ

తాజాగా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేసిన ఈదర మోహన్

ఒంగోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కీలకమైన మరో విభాగం దృష్టి సారించింది. ఇప్పటికే ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై తొలుత విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టగా తర్వాత కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని ముగ్గురు అధికారుల కమిటీ విచారణ నిర్వహిస్తోంది. దాదాపు పక్షం రోజులుగా ఇది కొనసాగుతుండగా అనేక అక్రమాలు, అవినీతి వ్యవహారాలు వెలుగు చూస్తున్నాయి. ఇందుకు సంబంధించి వరుస కథనాలు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వంలో కీలకంగా పనిచేసే ఇంటెలిజెన్స్ (గూఢచార) విభాగం అధికారులు దృష్టి సారించారు. విభిన్న అంశాలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తగు సమాచారం ఇచ్చే కీలకమైనది ఐబీ విభాగం కాగా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు శీనారెడ్డి వ్యవహారంపై దృష్టిసారించారు. రెండు, మూడు రోజులుగా శీనారెడ్డి పీడీగా పని చేసిన కాలంలో ఏం జరిగింది, ఏఏ అంశాలలో అక్రమాలు చోటుచేసుకున్నాయి, ప్రస్తుతం అధికారుల విచారణ ఎలా జరుగుతుందని ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం కొందరు కీలక వ్యక్తులను కలిసి వివరాలు సేకరించారు. అలాగే ఇప్పటికే అధికారవర్గాల నుంచి కూడా వారు కొంత సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది.

పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు

శీనారెడ్డి అక్రమాలపై విచారణ కోరుతూ పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ ప్రభుత్వ పెద్దల నుంచి అధికారుల వరకు పలుమార్లు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తాజాగా డ్వామాను పర్యవేక్షించే రాష్ట్రస్థాయి అత్యున్నత అధికారైన గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను కూడా కలిసి మరోసారి ఫిర్యాదు చేశారు. ఒంగోలులో సోమవారం జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణకు కమిషనర్ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయనన్ను మోహన్ కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో తాను చేసిన ఫిర్యాదు కాపీలు, మీడియాలో వచ్చిన కథనాలు ప్రస్తుతం జరుగుతున్న అధికారుల విచారణలో వెలుగుచూస్తున్న అంశాలను వివరించారు. మరింత లోతుగా విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ అన్ని అంశాలను విని నిర్దిష్ట చర్యలకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలాఉండగా లోకేశ్వరరావు కమిటీ తమ విచారణలో భాగంగా ఈనెల 8,9 తేదీల్లో శీనారెడ్డిపై ఫిర్యాదులు చేసిన, అలాగే ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన డ్వామా ఉద్యోగులను విచారించనుంది. ఈనెల 8న ఐదుగురు ఫిర్యాదుదారులను, 9వతేదీన 31 మంది డ్వామా ఉద్యోగులను విచారణ చేయనుంది. ఆ మేరకు హాజరుకావాలని వారందరికీ ఇప్పటికే నోటీసులు జారీచేశారు.

జీసీటీఏ జిల్లా కార్యదర్శిగా ప్రసాద్

అవీఇవీ



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) బాపట్ల జిల్లా యూనిట్‌కు జరిగిన ఎన్నికలలో కార్యదర్శిగా కేఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ వీ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన అధ్యాపకులు, సిబ్బంది జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రసాద్‌ను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

21 మంది ఉద్యోగాలకు ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

మార్టూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వివిధ కంపెనీలు నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అన్నారు. సోమవారం మార్టూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 44 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వారిలో 21 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీ ప్రణయ్ అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ఆంజనేయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, ఈఎస్‌సీ కోఆర్డినేటర్ నేతరు శ్రీకాంత్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్ పాల్గొనగా ఐసీఐసీఐ బ్యాంక్, ముత్తూట్, టాటా క్యాపిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిమట రహదారిలో కూలిన కల్వర్టు



వంతెన కూలిపోవడంతో కూరుకుపోయిన కట్టెల ట్రాక్టర్

మర్రిపూడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జువ్విగుంట-చిమట రహదారిలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు కూలిపోయింది. కొంత కాలంగా ఇది శిథిలావస్థలో ఉంది. ఏక్షణంలోనైనా కూలుతుందని గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం కట్టెల లోడుతో ఉన్న ట్రాక్టర్ కల్వర్టు మీదకు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. ట్రాక్టర్ ముందు భాగం కల్వర్టు గోతిలో ఇరుక్కుపోయింది. దీంతో ఆ దారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

దివ్యాంగ పింఛన్‌లపై విచారణ



లబ్ధిదారుడిని విచారిస్తున్న ఎంపీడీవో, డాక్టర్లు

కొండపి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కొండపిలో ఆరోగ్య పింఛన్‌లు అందుకుంటున్న 11 మందిని అధికారుల బృందం విచారించింది. మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని పరిశీలించింది. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులుతోపాటు ముగ్గురు ప్రభుత్వ డాక్టర్ల బృందం, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, కొండపి పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య పాల్గొన్నారు.

ఆరునెలల్లో గ్రామాల్లో మార్పు రావాలి

ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిచేయాలి

తర్వాత పనితీరు ఆధారంగానే కొనసాగింపు

ఉపాధి పనులపై పూర్తిస్థాయిలో అవగాహన పొందాలి

పొలాల్లో నీటి కుంటలు, చెరువుల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

కూలీలకు కనీస వేతనం రూ.300 రావాల్సిందే

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణతేజ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా ఆరు నెలల్లో గ్రామాల్లో మార్పులు రావాలని, లేదంటే క్షేత్రస్థాయి సహాయకులను తొలగిస్తామని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ స్పష్టంచేశారు. స్థానిక ఓ కన్వెన్షన్ హాలులో సోమవారం క్షేత్రస్థాయి సహాయకులు, సీనియర్ మస్టర్ల శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో కూలీలకు కనీస వేతనం రూ.220 మాత్రమే వస్తుండటంతో ముందుగా ఇక్కడ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. ఉపాధి ద్వారా రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలన్నారు. ఆ ఫలితాల్లో ఆరు నెలల్లో కనిపించే విధంగా ఉండాలన్నారు. ప్రధానంగా ప్రస్తుత సీజన్ ఉపాధి పనులకు అనుకూలమైందన్నారు. అందువల్ల రైతుల భూముల్లో నీటికుంటలతోపాటు పంచాయతీలో ఒక చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరుతున్నప్పుడు వారే ముందుకు వచ్చి నీటికుంటల పనులు చేపట్టాలని మన చుట్టూ తిరిగే విధంగా ఉండాలన్నారు. అది మీ పనితీరు మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. ఆ దిశగా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు ఆరు నెలల్లో పనితీరు మెరుగుపడకపోతే ఆ తర్వాత కొనసాగించాలా? లేదా? అనేది నిర్ణయం తీసుకుంటామన్నారు. కూలీలకు వేతనంలో కూడా జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడి ఉందన్నారు. కూలీలకు తప్పనిసరిగా రోజుకు రూ.300 వేతనం ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. ఆ దిశగా ఎఫ్‌ఏలు పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. అదనపు కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా చేపట్టాల్సిన పనులను పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని ముందుకుపోవాలన్నారు.

తెగుళ్లతో మిర్చి రైతుల బెంబేలు

» దెబ్బతింటున్న పైర్లు » పంటలను కాపాడుకునేందుకు అవస్థలు



నూతలపాడులో సాగులో ఉన్న మిర్చి

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులను పలు రకాల తెగుళ్లు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పైర్లు పచ్చగా ఉండి పూత పిందె దశకు చేరుకున్న తరుణంలో తెగుళ్లు సోకి పాడు చేస్తున్నాయి. తెగుళ్ల నుంచి పైర్లను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చేతికి అందివచ్చిన పంట తెగుళ్లబారినపడుతుండడంతో ఏమి చేయాలో అని తలలు పట్టుకుంటున్నారు. బొబ్బర, నల్లి తెగుళ్ల బాధ వెంటాడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కౌలు, వ్యవసాయ పెట్టుబడులు కలుపుకొని రూ. లక్ష వరకు ఖర్చు అయిందని, పైర్లను చూస్తుంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనపడడం లేదని మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో దాదాపు 15 వేల ఎకరాలకు పైగానే రైతులు మిర్చి పైరును సాగు చేస్తున్నారు. గత ఏడాది మిర్చి ధర దిగజారడం, పెట్టుబడులు అధికంగా ఉండడంతో ఈ ఏడాది సాగును తగ్గించారు. అయితే ఈ ఏడాది అయినా ధర ఆశాజనకంగా ఉంటుందన్న ఆశతో వ్యవప్రయాశలు పడి సాగు చేసిన రైతులకు తెగుళ్ల దాడి చేస్తున్నాయి. తెగుళ్ల తీవ్రతతో ఇప్పటికే వందల ఎకరాల్లో పైర్లు తొలగించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే గులాబీ తెగులుతో తెల్లబంగారం (పత్తి) నష్టపోయినట్లుగానే మిర్చి రైతులూ నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.



మందును పిచికారీ చేస్తున్న రైతు

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు



వేలకు వేలు పెట్టుబడులు పెట్టి మిర్చిని సాగు చేస్తున్నాను. తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం నల్లి తెగులు ఉధృతంగా ఉంది. పైర్లు నిలువునా దెబ్బతింటున్నాయి. ఎన్ని క్రిమిసంహారక మందులు చల్లినా ఫలితం కన్పించడం లేదు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

- జీ.రమణమ్మ మహిళా రైతు, నూతలపాడు

నీరు అందుబాటులో ఉందని సాగు చేశాం



గత ఏడాది ఆరుతడులకు నీరు లేకపోవడంతో సాగు చేసుకున్న పైర్లను కాపాడుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాం. ఈ ఏడాది నీరు అందుబాటులో ఉండడంతో వ్యయ ప్రయాసలు పడి ఉన్న కొద్దిభూమితోపాటు, మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చిని సాగుచేశాను. పైర్లు ఆశాజనకంగా ఉన్న తరుణంలో తెగులు సోకింది.

- గన్నవరపు సాంబయ్య, నూతలపాడు



సొన స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

వేటపాలెం(చీరాల), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయినిపల్లి పంచాయతీ పరిధిలో సొన భూమిని కొందరు ఆక్రమించగా, వారిని తొలగించి సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్వతి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా కఠిన తప్పవని స్పష్టం చేశారు.

మద్యం దుకాణదారులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలా.. బార్‌లా..? అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనంపై చీరాల మండలం ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, కారంచేడు ఎస్సై వెంకట్రావు స్పందించారు. తమ, తమ పరిధుల్లోని మద్యం దుకాణాలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్‌ల మాదిరిగా మద్యం తాగేందుకు వసతులు కల్పించేందుకు వారికున్న అనుమతులు ఏమిటో తెలపాలని ఆ నోటీసులలో పేర్కొన్నట్లు ఈపురుపాలెం, వేటపాలెం, కారంచేడు ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు,వెంకట్రావు తెలిపారు. దీంతో పాటు సంబంధిత ఎక్సైజ్ అధికారికి కూడా అనధికారిక పర్మిట్ రూమ్‌లతో లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ ఏర్పడుతోందన్న విషయాన్ని చెపుతామన్నారు. ఇప్పటికే సంబంధీకులకు నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనల మేరకు మాత్రమే వారివారి విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులను తాము ఏ మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

అద్దంకి పట్టణంలో 31,631 మంది ఓటర్లు

మహిళలే అధికం



అద్దంకి పట్టణ ఓటర్ల జాబితాను ప్రకటిస్తున్న అధికారులు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ ఓటర్లు 31,631 మందికి చేరారు. పోలింగ్ బూతులవారీగా ఓటర్ల జాబితాను సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ప్రకటించారు. అద్దంకి పట్టణంలో మొత్తం 31 పోలింగ్ బూత్‌లు ఉండగా పురుష ఓటర్లు 15,155 మంది, మహిళా ఓటర్లు 16,470 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 6 గురు ఉన్నారు. ఓటర్ల జాబితా సమాచారాన్ని కార్యాలయం పనివేళలలో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మేనేజర్ శ్రీదేవి, టీపీఎస్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో ఉన్న తప్పులను సవరించాలి

మార్టూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో నమోదైన తప్పులను సవరించాలని సర్పంచ్ ఎం.సతీష్ కుమార్‌తోపాటు రైతు సంఘం ప్రతినిధులు తహసీల్దార్ టీ ప్రశాంతికి వినతిపత్రం అందచేశారు. సోమవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సర్పంచ్ సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా, హాజరయిన తహసీల్దారు ప్రశాంతితో రైతు సంఘం ప్రతినిధులు మాట్లాడారు. గ్రామంలోని శివాలయంలోని సర్వే నెంబర్ 208లో దేవాలయానికి 20 సెంట్లు కేటాయిస్తే మిగిలిన భూమి కూడా దేవదాయశాఖకు చెందిన భూమిగా రీసర్వేలో నమోదు చేశారన్నారు. తద్వారా వాటి భూములలోని రైతులు కొనుగోలు, అమ్మకాలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా గ్రామ కంఠం భూమి ప్రభుత్వ భూమిగా ప్రకటించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపుగా 90 శాతం తప్పులు రీసర్వేలో జరిగాయని వాటిని వెంటనే సవరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు,తాటి నాగార్జున, కందిమళ్ల రామకోటేశ్వరరావు, మండల సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో వీరయ్య, సర్వేయరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా లక్ష్మీనారాయణ

యద్దనపూడి (మార్టూరు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా పీ లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ఎస్ఎం అకీబ్ జావెద్ వ్యక్తిగత పనులు నిమిత్తం ఈ నెల 1 నుంచి 28వతేదీ వరకు సెలవుపై వెళ్లారు. దీంతో జడ్పీ కార్యాలయం నుంచి లక్ష్మీనారాయణను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో సకాలంలో వైద్యం

ఎమ్మెల్యే కొండయ్య



సీఎం రిలీఫ్ ఫండ్ సాయం పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మందికి సకాలంలో వైద్యం అందుతోందని, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని 16 మందికి రూ.20,89,377 చెక్కులను ఎమ్మెల్యే కొండయ్య అందజేశారు. థామస్‌పేటకు చెందిన మల్లెపోగు అనిత కుమారికి రూ.86,814, గొల్లపాలెంకు చెందిన చుక్కా కృష్ణకు రూ.1,77,790, ఈపురుపాలెంకు చెందిన ఎన్.శ్రీలేఖకు రూ.2,33,962, వాడరేవుకు చెందిన యాకోబుకు రూ.60వేలు, ఈపురుపాలెంకు చెందిన కుమార్‌రాజాకు రూ.40వేలు, షేక్ బుడేకు రూ.17,101, పి.హాసినికి రూ.26,218, కె.అశ్వినికి రూ.30వేలు, సీహెచ్ ఏడుకొండలకు రూ.49,258లు, మణికంఠకు రూ.31,377, అభినవ్‌కు రూ. 2,50,000, పాపరాజుతోటకు చెందిన సాంబశివరావుకు రూ.40,166, వేటపాలెంకు చెందిన యానాదిరావుకు రూ.3,03,678, రామకృష్ణాపురానికి చెందిన బాలచంద్రశేఖర్‌కు రూ.1,20,550, దేవాంగపురికి చెందిన జితేంద్రకుమార్‌కు రూ.1,20,283, పాతచీరాలకు చెందిన కె.భవిష్‌రెడ్డికి రూ.5లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పత్రాలను డిప్యూటీ ఈవోకు అందజేస్తున్న పాఠశాల కమిటీ ప్రతినిధులు

కారంచేడు ఎయిడెడ్ పాఠశాల ప్రభుత్వానికి అప్పగింత

డిప్యూటీ ఈవోకి పత్రాలను అందజేసిన కమిటీ ప్రతినిధులు

కారంచేడు(పర్చూరు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయడమ్మ ఎయిడెడ్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ మేరకు సోమవారం కమిటీ ప్రతినిధులు బాపట్ల జిల్లా డిప్యూటీ ఈవో ఎ.శ్రీనివాసరావుకు పాఠశాలను అప్పగిస్తూ పత్రాలను సమర్పించారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ లగడపాటి రాజ్యలక్ష్మి, మధుసూదనరావు అభీష్టం మేరకు యార్లగడ్డ రఘుబాబు చేతుల మీదుగా పాఠశాలకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సం నుంచి ఈపాఠశాల ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారు ఎంవీవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, స్టిబంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

చెత్త సేకరణతో ఆదాయం పొందాలి

పంగులూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. మండల కేంద్రమైన పంగులూరులోని చెత్త సంపద కేంద్రాన్ని సోమవారం స్వరూపారాణి పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి కంపోస్టును తయారు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శి రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

ధేనువకొండలో చోరీ కేసు నమోదు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధేనువకొండలో చోరీ జరిగిన ఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. దేనువకొండకు చెందిన బోడపాటి అంజయ్య ఈ నెల 2వ తేదీ రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.35వేలు, 11 గ్రాముల బంగారం అపహరించుకు పోయారు. బాధితుడు అంజయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి విద్యుత్ సమస్యలపై ప్రజాభి ప్రాయ సేకరణ జరుగుతుందని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం నుంచి 10వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుంటే విడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాన్ని అద్దంకిలోని కార్యాలయంలో నుంచి తెలియజేసే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.

ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అద్దంకి డివిజన్ పరిధిలోని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

మంచంపై ఉన్న పింఛన్‌దారుల పరిశీలన



మణికేశ్వరం గ్రామంలో పింఛన్‌దారులను పరీక్షిస్తున్న వైద్య బృందం

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అద్దంకి మండలంలోని పలు గ్రామాలలో కదలేక మంచంపై ఉంటూ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులును గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం సోమవారం పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన ఆర్థోపెడిక్ డాక్టర్ హరిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణాదినాతో పాటు మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీహర్షతో కూడిన వైద్య బృంద పింఛన్‌దారులను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పింఛన్‌దారుల జాబితా ప్రకారం మండలంలోని మణికేశ్వరం గ్రామంలో వైద్య బృందం పర్యటించింది. కాళ్ల, చేతుల కదలిక, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వివరాలను నమోదు చేశారు. మంచంపైనే ఉంటూ కదలలేని పింఛన్‌దారులు మండలంలో 31 మంది వరకూ ఉన్నారని, మరో రెండు రోజుల పాటు పరిశీలిస్తామని డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. వారి వెంట ఎంపీహెచ్‌ఈవో ఏ.నాగేశ్వరరావు, జానీ, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసరాలను అందజేస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య, టీడీపీ నేతలు

అగ్నిప్రమాద బాధితులకు ఏలూరి సాయం

రూ.25వేలు అందజేసిన తహసీల్దార్, టీడీపీ నేతలు

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూ.25వేల నగదును సమకూర్చారు. సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్య స్థానిక నేతలతో కలసి కుటుంబ సభ్యులకు సాయాన్ని ఇచ్చారు. దీంతోపాటు నిత్యావసర సరుకులను కూడా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, టీడీపీ నేతలు ఎం నరేంద్ర, సురేష్, శివనాగేశ్వరరావు, షేక్ గౌస్, వీఆర్వోలు గోవిందరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిశ్రాకు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఉప కులాల వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించన ఏకసభ్య కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రాను సోమవారం అద్దంకి ఎంఈఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు కలిశారు. ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు న్యాయం చేయాలని, వర్గీకరణ చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ అద్దంకి నియోజకవర్గం అధ్యక్షుడు అనపర్తి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి గంగవరపు సిద్దు, ట్రెజరర్ మున్నంగి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు మల్లవరపు దాసు, చెన్నయ్య, అంకయ్య, నరేష్, ఉదయ్, బుజ్జిబాబు ఉన్నారు.

సంతమాగులూరు : మండలంలోని పాత మాగులూరు ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన కులగణనలో ఎస్సీ మాదిగ అని మాత్రమే నమోదు చేసి జాతీయతా కాలమును ఖాళీగా వదిలి వేశారని దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు సోమవారం ఎస్సీ కాలనీకి పరిశీలనకు వచ్చిన సోషల్ వెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూ స్వరూపకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో 400 కుటుంబాలు ఎస్సీలు నివసిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం స్వరూప మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో కుల గణనకు సంబంధించి లిస్టులు డిస్ ప్లే చేసి ఉన్నాయన్నారు. బాధితులు తమ తమ కులగణనని సరి చేసుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మిరియాల శేషుబాబు, వీఆర్వో రాధిక, ఎస్సీ హాస్టల్ వార్డెన్ మున్నంగి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకొని లక్ష్యాలు సాధించాలి



గురుకుల విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సాయాన్ని వినియోగించుకొని క్రమశిక్షణతో చదువుకొని లక్ష్యాలను సాధించాలని విద్వాన్ జ్యోతిచంద్రమౌళి అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. రోటరీ కోశాధికారి మలాది శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, తాళ్లూరి బాబూరావు, ప్రిన్సిపాల్ పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

మృతుడి అనకాపల్లి వాసి

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో అనకాపల్లి జిల్లాకు చెందిన వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈఘటన సీఈసీ కళాశాల సమీపంలోని రామాపురం రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. ఈపూరుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం ఆర్ భీమవరానికి చెందిన కోడూరు వెంకటరావు (35) రామాపురానికి చెందిన జయరాణిను సుమారు పదేళ్ల క్రితం వివాహ మాడాడు. ప్రస్తుతం వీరికి ఎనిమిదేళ్ల పాప ఉంది. వెంకటరావు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో నెలకొన్న వివాదాలు కారణంగా మనస్తాపం చెందిన అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



మరుగుదొడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అసిస్ట్, యూఎల్‌టీసీ ప్రతినిధులతో టీడీపీ నాయకులు

యద్దనపూడి (మార్టూరు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం, వింజనంపాడు, సూరవరపు పల్లి గ్రామాలలో యూఎల్‌టీసీ కంపెనీ వారి ఆర్థిక సహకారంతో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటిని చిలకలూరిపేటలోని అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణాన్ని పూర్తిచేస్తారు. మొదటిగా అనంతవరం గ్రామంలో ఎస్టీ కాలనీలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధులు జీ భరత్‌రెడ్డి, నరసరాజు మాట్లాడుతూ మూడు గ్రామాలలో కులాలు, మతాలతో సంబంధం లేకుండా గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి అవసరమైన వారికి మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్ ఎం.విష్ణుప్రియ, కోఆర్డినేటర్ కే డేవిడ్, టీడీపీ గ్రామ నాయకులు గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని విజయవంతం చేయాలి

పామూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొల్లా మాల్యాద్రిచౌదరి జ్ఞాపకార్థం మండలంలోని గుమ్మలంపాడులో ఈనెల 9 నుంచి నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్న జీఎంపీ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు.